క్లుప్తంగా

యూరియా కొరత రావొద్దు



వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

గన్నేరువరం: మండలంలోని రైతులకు యూరియా కొరత రాకుండా చూడాలని తహసీల్దార్ కార్యాలయంలో డీటీ ప్రణీత్‌కు సీపీఐ నాయకులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. గన్నేరువరంలోని సొసైటీకి మాత్రమే యూరియా రావడంతో దూర ప్రాంతాల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, గుంతల రోడ్డుతో అవస్థలు పడుతున్నారని, హన్మాజీపల్లి, గుండ్లపల్లిలోని ఫర్టిలైజర్ షాపులకు ఎరువుల బస్తాలను సరఫరా చేయాలని కోరారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు తగుచర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి చొక్కాల శ్రీశైలం, సహాయ కార్యదర్శి కూన మల్లయ్య, పిప్పల్ల కనకయ్య, గన్నేరువరం సీపీఐ కార్యదర్శి బోయిన మల్లయ్య, సహాయ కార్యదర్శి బొమ్మకంటి అంజయ్య చారి, ఎండి నయుం, రాపోలు రాయమల్లు, కూన లక్ష్మయ్య, కూన ఎల్లయ్య, జాలి గోపయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న కాలనీవాసులు

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ గ్రామం కిష్కిందపల్లెలో శిలాఫలకం ధ్వంసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వాసులు ఎంపీడీవో కృష్ణప్రసాద్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. 2008లో అప్పటి కమలాపూర్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సీసీరోడ్డు వేయించగా శిలాఫలకం ఏర్పాటు చేశారని తెలిపారు. రెవెన్యూ అధికారులు, పోలీసులకు సైతం ఫిర్యాదు చేశామన్నారు.

అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు



మాట్లాడుతున్న నరేశ్, నాయకులు

చిగురుమామిడి: మండలంలోని చాలా గ్రామాల్లో అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నారని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తాళ్ల నరేశ్ ఆరోపించారు. మంగళవారం నాయకులతో కలిసి మాట్లాడారు. ఇళ్ల ఎంపికలో అవినీతి, అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని, సుందరగిరిలో శ్రీనివాస్,సృజన దంపతుల ఆత్మహత్యాయత్నం ఘటననిదర్శనమన్నారు. మండల వ్యాప్తంగా ఇందిరమ్మ కమిటీ, అధికారుల నిర్వాకంపై జిల్లా అధికారులు విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆధారాలతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గాజుల రవి, మండల నాయకులు అనిల్‌కుమార్, భూపతి, రమేశ్, శ్యామ్, మధు పాల్గొన్నారు.

సాగునీటి కోసం వాగ్వాదం

హుజూరాబాద్‌రూరల్: దేవాదుల నుంచి వచ్చే సాగునీటి కోసం కాట్రపల్లి, దమ్మక్కపేట రైతుల మధ్య ఏర్పడిన వాగ్వాదం తోపులాటకు దారితీసింది. సోమవారం రాత్రి దేవాదుల నుంచి వచ్చే నీరును కాట్రపల్లి గ్రామ శివారులోని తూము వద్ద దమ్మక్క పేటకు చెందిన పలువురు రైతులు తమ గ్రామానికి మళ్లించడానికి ప్రయత్నించారు. దీంతో కాట్రపల్లి రైతులు ప్రయత్నంను అడ్డుకోవడంతో ఇరు గ్రామాల రైతుల మధ్య వివాదం ఉద్రిక్తతకు దారి తీసింది. వివాదాన్ని పరిష్కరించడం కోసం మంగళవారం హుజూరాబాద్ టౌన్ సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో ఎస్ఐ రాధాకృష్ణ కాట్రపల్లి తూమును పరిశీలించారు. రెండు గ్రామాల్లోని కాలువల వద్ద పోలీసులను కాపలా ఉంచారు. ఇరు గ్రామాల రైతులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి ప్రయత్నించారు. దేవాదుల ప్రాజెక్టు డీఈ ప్రశాంతి గొడవ పడకుండా వంతుల వారీగా నీరు వాడుకోవా లని సూచించారు. బుధవారం రైతులతో మా ట్లాడతానని తెలపడంతో వివాదం సద్దుమణిగింది.

8న గద్దర్ వర్ధంతి సభ

జమ్మికుంట: హుజూరాబాద్ పట్టణంలోని సిటీ కన్వెన్షన్ హాల్‌లో తెలంగాణ కళాకారుల సమైక్య ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు శనిగరం బాబ్జి ఆధ్వర్యంలో 8న ప్రజాయుద్ధ నౌక గద్దర్ రెండో వర్ధంతి నిర్వహించనున్నారని, వర్ధంతి సభను విజయవంతం చేయాలని ద్రావిడ సాహిత్య సాంస్కృతిక కళామండలి వ్యవస్థాపక అధ్యక్షుడు రామంచ భరత్ మంగళవారం పిలుపు నిచ్చారు. గద్దర్ కుమార్తె, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్, ప్రధాన వక్తగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చింతకింది ఖాసీం, వాగ్గేయకారులు ఏపూరి సోమన్న, గర్జన గాయకులు వడ్లకొండ అనిల్‌కుమార్, వర్కాపురం రవికుమార్, కళాకారులు ప్రభు, పుల్ల వెంకన్న, మోరే సంపత్, ఎండీ, రహీం, శ్రీధర్, యోగానంద్, అనందం, రాజు, శ్రీకాంత్, విజయేందర్, రవి హాజరవుతారని పేర్కొన్నారు.

ప్రతిపాదనలకే పరిమితం

- బేతిగల్–పోతిరెడ్డిపేట రోడ్డు నిర్మాణానికి ఏళ్లుగా ఎదురుచూపు
- అంతర్గత రోడ్డుతో బేతిగల్, కనపర్తి ప్రజలకు తగ్గనున్న దూరభారం



బేతిగల్ నుంచి పోతిరెడ్డిపేటకు వెళ్లే దారి

వీణవంక: మండలంలోని బేతిగల్ గ్రామం నుంచి హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపేట వరకు అంతర్గత రోడ్డు వేయాలని గ్రామస్తులు ఏడేళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్న మోక్షం కలగడం లేదు. ఇరు గ్రామాల మధ్య రోడ్డు వేస్తే బేతిగల్, కనపర్తి గ్రామాల ప్రజలకు రవాణా సులభతరం కానుంది. అంతేకాకుండా దూరభారం తగ్గనుంది. అంతర్గత రోడ్డు ప్రతిపాదనలకే పరిమితం కావడంతో ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. బేతిగల్ చర్చికాలనీ నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ మీదుగా పోతిరెడ్డిపేట వరకు సుమారు ఐదు కిలోమీ టర్ల దూరం. ఈ దారి మీదుగా హుజూరాబాద్, వరంగల్, హైదరాబాద్‌కు వెళ్తంటారు. మట్టిరోడ్డు కావడంతో బైక్‌లు మాత్రమే వెళ్తున్నాయి. ఇతర వాహనదారులు శంకరపట్నం మండలం మెట్టుపల్లి, పోతిరెడ్డిపేట, సిర్సపల్లి మీదుగా హుజూరా బాద్‌కు వెళ్తుండటంతో అదనంగా పది కిలోమీటర్ల దూరం భారం పడుతుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌ను గ్రామస్తులు కలిసి వినతిపత్రం ఇవ్వడంతో పంచాయతీరాజ్‌శాఖ అధికారులతో ఎస్టిమేషన్ వేయించి ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ప్రభుత్వం మారడంతో ఆ ప్రతిపాదనలు అటకెక్కాయి. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అధికా రంలోకి రావడంతో కాంగ్రెస్ కార్యకర్తలు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి సమస్య విన్నవించారు. దీంతో రోడ్డు వేసేందుకు హామీ ఇచ్చినట్లు తెలిసింది. అదేవిధంగా ఎంపీ బండి సంజయ్‌కుమార్ దృష్టికి కూడా బీజేపీ జిల్లా నాయకుడు గొట్టిముక్కుల సంపత్‌రావు రోడ్డు దుస్థితిని తీసుకెళ్లారు. ఇటీవల పార్టీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి బేతిగల్ గ్రామానికి రాగా గ్రామీణ సడక్ యోజన పథకం కింద రోడ్డు మంజూరు చేయాలని కార్యకర్తలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పోతిరెడ్డిపేట వరకు రోడ్డు మంజూరైతే రెండు గ్రామాలకు అనుసంధానం కానుంది. రెండు, మూడు రోజుల్లో మంత్రి పొన్నం వద్దకు మరోసారి గ్రామస్తులు రోడ్డు దుస్థితిపై వినతి పత్రం ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు.



శంకరపట్నం: కరీంపేట గ్రామ శివారులోని ఉపకాలువలో సిమెంట్ లైనింగ్ పనులు చేపట్టకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు గడ్డి, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో కాలువ చివరివరకు సాగునీరు చేరదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగునీటికి ఇబ్బందులు పడతామని, నీరు విడుదల చేస్తే మెట్టప్రాంతంలో వందల ఎకరాలకు సాగునీరు అందుతుందని, కాలువ లైనింగ్ పనులు పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
కవిత, ఇరిగేషన్ డీఈ , తాడికల్ డివిజన్ నం.9177812458

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

పర్యాటక పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్



మాట్లాడుతున్న అశ్విని తానాజీ వాకడే

సైదాపూర్: మండలంలోని సర్వాయిపేట పాపన్న గుట్టలపై చేపడుతున్న పర్యాటక పనులను కరీంనగర్ జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ మంగళవారం పరిశీలించారు. సర్వాయి పాపన్న గుట్టలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ గత ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఈ మేరకు మంత్రి పొన్నం రూ.470 కోట్ల నిధులు మంజూరు చేయించగా పనులకు శంకుస్థాపన చేశారు. అందులో భాగంగా జిల్లా అధికారులు తరచూ సందర్శిస్తూ పనులు పరిశీలిస్తున్నారు. పనుల్లో నాణ్యత పాటించాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను లక్ష్మీకిరణ్ ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, పర్యాటక శాఖ డీఈ నటరాజు తదితరులు ఉన్నారు.

పోతిరెడ్డిపల్లిలో అదనపు కలెక్టర్ విచారణ

వీణవంక: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయ గోడను అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మంగళవారం పరిశీలించారు. ఇటీవల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి లోక్ ఆదాలత్‌లో ఫిర్యాదు చేయగా గ్రామస్తుల సమక్షంలో విచారణ జరిపారు. అదేవిధంగా చల్లూరు గ్రామంలోని పీహెచ్‌సీని తనిఖీ చేసి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించారు, ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్, ఎంపీవో సురేందర్, ఉన్నారు.

ఆధ్యాత్మికం

ఆలయ పునర్నిర్మాణానికి దాతల సహకారం



విరాళం అందజేస్తున్న దాతలు

ఇల్లందకుంట: ఇల్లందకుంట నుంచి చిన్నకోమటిపల్లికి వెళ్లే దారిలోని అతిపురాతన శివాలయంలో నలభై ఏళ్లుగా పూజలు నిర్వహించలేదు. ఓ అజ్ఞాత వ్యక్తి ఆలయాన్ని శుభ్రం చేసి శివలింగానికి పూజలు చేశాడు. ఆలయ పునర్నిర్మాణానికి మంగళవారం దాతలు నల్లగొండ వినయ్‌రూ.5000, రామస్వామి రూ.10,000, మంతెన శ్రీధర్ రూ. 5000, కట్టంగూరి రమాదేవి ప్రభాకర్‌రెడ్డి జ్ఞాపకార్థంగా మనవడు అభినవ్‌రెడ్డి రూ.50 వేలు, కంకణాల గణపతిరెడ్డి రూ. 11,016, చింతిరెడ్డి దేవేందర్‌రెడ్డి రూ.11వేలు, లింగాల మౌనిక వేణుగోపాల్‌రెడ్డి రూ.11వేల విరాళం అందజేశారు. ఆలయ పునర్నిర్మాణానికి గ్రామస్తులతోపాటు భక్తులు విరాళం అందజేసి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రాజమల్లు, రాజు, రమేష్, పర్శ రాములు, శ్రీరామ్‌రెడ్డి, రమేశ్, సమ్మిరెడ్డి, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీదురామాత విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామంలో నిర్మించిన శ్రీదుర్గామాత ఆలయంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించడం జరుగుతోందని వెలిచాల ధార్మిక ట్రస్ట్ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. 6న వేద స్వస్తి, ప్రతిష్ఠ సంకల్పం, గోపూజ, విఘ్నేశ్వర పూజ, స్వస్తి పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం 7న మంటప, మూల మంత్ర హోమం, మహాస్నపనం, సాయంత్రం ధాన్యాదివాసం, శయ్యాదివాసం, ఫలాదివాసం 8న యంత్ర స్థాపన, ప్రాణప్రతిష్ఠ, కళాన్యాసం కార్యక్రమాలను వేద పండితులు శ్రీనంబి వేణుగోపాలాచార్య ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతోందని నిర్వాహకులు తెలిపారు.

శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రామడుగు: మండలంలోని రుద్రారం గ్రామంలో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కోటగిరి నరసింహచారి ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కట్ట బ్రహ్మచారి, మల్లేశం, చొప్పదండి రమేష్, పురుషోత్తమాచారి, శ్రీధరాచారి, బీజేపీ రామడుగు మండల మాజీ అధ్యక్షుడు ఒంటెల కరుణాకర్ రెడ్డి, స్టేట్ కౌన్సిల్ మాజీ సభ్యుడు కట్ట రవీందర్, నాయకులు శ్రీనివాసాచారి, లక్ష్మణ్, ప్రశాంత్ భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



చొప్పదండి: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయంలో మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారి పట్టువస్త్రాలు, పుస్తెమెట్టెలను మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకువచ్చారు. కల్యాణోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఏటా శ్రావణ మాసంలో కల్యాణం నిర్వహిస్తామన్నారు. భజన మండలి సభ్యుల భజన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొడిగె వెంకటేశ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి చేపూరి సత్యనారాయణగౌడ్, గౌరవ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రావణ్ కుమార్, ఎన్నం మునీందర్, పొరండ్ల భాస్కర్, కత్తి రమేశ్, నలుమాచు రామకృష్ణ, నోముల గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



చిగురుమామిడిలో సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎంఈవో పావని, బీజేపీ నాయకులు

సైకిళ్లు పంపిణీ

చిగురుమామిడి: చిగురుమామిడి ప్రభుత్వ జెడ్పీ పాఠశాల పదోతరగతి విద్యార్థులకు కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ జన్మదినం పురస్కరించుకొని సైకిళ్లు పంపిణీ చేశారు. మంగళవారం పాఠశాల ఆవరణలో ఎంఈవో పావని విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పోలోజు సంతోష్‌కుమార్, మాజీ ఉపసర్పంచ్ బి మహేందర్, హెచ్‌ఎం రబియాబస్రి, మండల విశ్వకర్మ సెల్ కన్వీనర్ సదాదాచారి, అమ్మ ఆదర్శపాఠశాల అధ్యక్షురాలు అరుణ, నాయకులు దొంత కరుణాకర్, రాయమల్లు, సాయికుమార్, రాజు, సతీష్, వంగ మల్లయ్య, ఓదెలు పాల్గొన్నారు.

గంగాధర: కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ జన్మదినం సందర్భంగా పీఎం మోదీ గిఫ్ట్‌గా గంగాధర ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు బీజేపీ మండల అధ్యక్షుడు పంజాల ప్రశాంత్ ఆధ్వర్యంలో నాయకులు సైకిళ్లు పంపిణీ చేశారు. మండలంలోని 220 మందికి సైకిళ్లు అందజేయనున్నామని, విద్యార్థులను ప్రోత్సహించడానికి, పదిలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి సైకిళ్లు అందజేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రభాకర్‌రావు, హెచ్‌ఎం శ్రీలత, నాయకులు వైద రామానుజం, పెరుక శ్రావణ్‌కుమార్, దూలం కళ్యాణ్, కోల అశోక్, సదాల భాస్కర్, గాలిపెల్లి శ్రీనివాస్, తాళ్ల రాజశేఖర్, నర్సింహరెడ్డి, రేండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారుల నిరసన



నిరసన తెలుపుతున్న వ్యాపారులు

జమ్మికుంట: పట్టణంలోని కొండూరి కాంప్లెక్స్ రోడ్డులో వారసంత నిర్వహించొద్దని అధికారులకు ఫిర్యాదు చేసినా నేపథ్యంలో మంగళవారం చిరు వ్యాపారులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ఆసుపత్రులు, స్కూళ్లకు చెందినవారు మున్సిపల్ అధికారులు ఫిర్యాదు చేశారు. వారసంత వేరే చోట నిర్వహించాలని అధికారులు చిరు వ్యాపారులకు సూచించారు. ఏళ్లుగా ప్రతీ మంగళవారం కొండూరి కాంప్లెక్స్ రోడ్డులో వారసంత జరుగుతుందని, ఈ ప్రాంతంలో వారసంత నిర్వహిస్తే గిట్టుబాటు అవుతుందని ఎక్కడికి వెళ్లేది లేదని వ్యాపారులు రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో యథావిధిగా వారసంత కొనసాగింది.

సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కమిషనర్ ఎండి అయాజ్

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని వీధి వ్యాపారులు ప్రమాదబీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఎండీ అయాజ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని వీధి వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సీఐజీ(కామన్ ఇన్‌ట్రెస్ట్ గ్రూపు)లుగా విధి వ్యాపారులు రూ.10 వేల నుంచి రూ.50వేల వరకు లోన్ తీసుకొని చెల్లిస్తున్నారని, ఒకే వృత్తి వారిని గుర్తించి రూ.ఐదులక్షల వరకు లోన్ ఇచ్చే సౌకర్యం ఉందని, వ్యాపారులు ప్రతీ ఒక్కరు ఐడీ కార్డులు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ ఈఈ శ్రీకాంత్, సీఎల్ఆర్పీలు జ్యోతి, మంజుల పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

వీణవంక: మండలంలోని చల్లూరు సెక్షన్ కార్యాలయంలో బుధవారం విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించనున్నామని వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ వేణుగోపాలచారి ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు లోకల్ కోర్టు ఉంటుందని, లోకల్ కోర్టులో విద్యుత్ పునరుద్ధరణ, వోల్టేజీ హెచ్చుతగ్గులతో పాటు పలు వివిధ అంశాలపై వినియోగదారులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి

గన్నేరువరం: బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని పార్టీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేశ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఇంటింటికీ బీజేపీ మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్టీ నాయకుడు సొల్లు అజయ్‌వర్మ హాజరయ్యారు. కరపత్రాలను పంచుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతో ప్రజలకు లబ్ధి చేకూరుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు పుల్లెల రాము, మునిగంటి సతయ్య, అటికం రామచంద్రం, శ్రీనివాస్ రెడ్డి, కూర రాజశేఖర్ పాల్గొన్నారు.

శంకరపట్నం: గ్రామాల అభివృద్ధికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని బీజేపీ నాయకులు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. మండలంలోని గద్దపాక, గొల్లపల్లి, ముత్తారం, మెట్‌పల్లి, కాచాపూర్, కన్నాపూర్, ఆముదాలపల్లి, ధర్మారం, కొత్తగట్టు, చింతలపల్లి గ్రామాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు అనిల్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, సమ్మిరెడ్డి, జైపాల్, సాగర్, రాజిరెడ్డి, శ్రీనివాస్, అనిల్ పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడి మృతి

జమ్మికుంట: ఉరేసుకొని యువకుడు మృతి చెందాడని జమ్మికుంట టౌన్ సీఐ రామకృష్ణ తెలిపారు. ఇల్లందకుంట మండలం కనగర్తి గ్రామానికి చెందిన రాసమల్ల అజయ్(23) స్నేహితులతో కలిసి ఈ నెల 2న మద్యం సేవించాడు. మద్యం మత్తులో సెల్‌ఫోన్ తీసుకొని వచ్చాడని హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం బీంపల్లి గ్రామానికి చెందిన వీరన్న, అతని కొడుకు ఆదివారం అజయ్ ఇంటికి వచ్చి బూతులు తిడుతూ బెదిరించి వెళ్లిపోయారు. మంగళవారం ఉదయం ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లి మడిపల్లి రైల్వేగేటు సమీపంలోని ఓ చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతిపై అనుమానం ఉందని తండ్రి ఐలయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

విజయవంతం చేయాలి

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని సాయిరూప గార్డెన్‌లో 7న నిర్వహించే ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సన్నాహక సభను విజయవంతం చేయాలని వీహెచ్‌పీఎస్ గ్రామ కమిటీ నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పింఛన్ పెంపుపై నిర్వహించే సన్నాహక సభతో ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లనున్నారని, సభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు తిరుపతి, రాజు, వసంత్, శ్రీనివాస్, గట్టమ్మ తదితరులున్నారు.

హిమ్మత్‌నగర్‌లో వంటావార్పు



వీణవంక: ఇసుక లారీలపై తాటి పత్రులు కప్పే ఉపాధి కల్పించాలని కోరుతూ మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామస్తులు చేపట్టిన నిరసన దీక్ష 27వ రోజుకు చేరింది. మంగళవారం గ్రామ ప్రధాన రోడ్డుపై వంటావార్పు చేపట్టి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇసుక రీచ్‌కు వెళ్లే లారీలు రోడ్డుపై నిలిచిపోయాయి. కొండపాక రెవెన్యూ గ్రామంలో హిమ్మత్‌నగర్ ఉంది కానీ కొండపాక గ్రామస్తులు మాత్రమే ఉపాధి పొందుతున్నారని, అన్ని విధాలుగా హిమ్మత్‌నగర్ నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం జరిగే వరకు దీక్ష విరమించమన్నారు. కార్యక్రమంలో గెల్లు మల్లయ్య, మ్యాక సమ్మయ్య, నల్ల కొండాల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రవీందర్‌రెడ్డి, సంపత్, భాస్కర్‌రెడ్డి, వెంకన్న, గెల్లు రమేశ్, తదితరులున్నారు.

ఈటలను బదనాం చేయొద్దు



మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ శ్రీరామ్ శ్యామ్

జమ్మికుంట: కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను దాచిపెడుతూ కాంగ్రెస్ నాయకులు బీజేపీ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై బురదజల్లే ప్రయత్నం మానుకోవాలని మాజీ జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్‌శ్యామ్ అన్నారు. మంగళవారం పట్టణంలో మాట్లాడారు. 2018 సెప్టెంబర్ వరకు మాత్రమే ఆర్థిక మంత్రిగా ఈటల కొనసాగారని, ఆ తర్వాత ఆరోగ్యశాఖ మంత్రిగా కొనసాగారని, 2019 జూన్‌లో కాళేశ్వరం ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రాజెక్టుకు నిధులు ఇచ్చారని, ఆర్థిక శాఖకు సంబంధం లేదని పీసీఘోష్ కమిషన్ తెలిపిందని, కాంగ్రెస్ నాయకులు కావాలనే బదనాం చేస్తున్నారని ఆరోపించారు. బీసీ నాయకుడు ఈటల ఎదుగుదల ఓర్వలేక దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, విజయ్, చందర్ తదితరులున్నారు.

'శ్రీచైతన్య'లో ఫ్రెషర్స్ డే



కరీంనగర్: నగరంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు రెండో సంవత్సర విద్యార్థులు ఘనంగా ఆటపాటలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత ముద్దసాని రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన చదువు విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్‌ను ప్రసాదిస్తుందని తెలిపారు. విద్యార్థులు రాబోయే పోటీ ప్రపంచానికి అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకొని తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శ్రీచైతన్య కళాశాలల డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, డీన్ జగన్మోహన్‌రెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ మల్లారెడ్డి, రాధాకృష్ణ, మోహన్‌రావు, ఏజీఎం శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.